# COMMUNIST PARTY OF INDIA (MARXIST)
## ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


ప్రచురణార్థం/ప్రసారార్థం : విజయవాడ,

తేది : 25 మార్చి, 2023.

## పోలవరం కాంటూరు హద్దుల్ని మార్చాలి

నిన్న అసెంబ్లీలో పోలవరంపై ముఖ్యమంత్రి చేసిన ప్రకటన నిర్వాసితులకు నష్టం చేసేదిగా ఉన్నది. పోలవరం డ్యాం నిర్మాణ ఎత్తుకనుగుణంగా మునక ప్రాంతాల్లో నిర్వాసిత గ్రామాలు, ప్రజల లెక్కలు లేవు. గత సంవత్సరం గోదావరి వరదల సందర్భంగా 138 అడుగులలోపే వచ్చినప్పటికీ 145 కాంటూరులో లేని గ్రామాలు కూడా మునిగిపోయాయి. గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక వచ్చేటప్పటికే అనేక గ్రామాలు వరదమయమయ్యాయి. కొత్తగా నిర్మించిన పునరావాస గ్రామాలు కూడా మునిగిపోతున్నాయి. పోలవరం రిజర్వాయరు కాంటూరు లెక్కలు తప్పులు తడకగా వున్నాయని ఇది రుజువు చేసింది. ఉన్నతస్థాయి ఇంజనీర్ల బృందాన్ని నియమించి తిరిగి కాంటూరు లెక్కలు తీసి దానికనుగుణంగా పునరావాసం కల్పించాలి.

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన నిర్వాసితుల సంఖ్య ఆమోదయోగ్యం కాదు. వాస్తవ మునక ప్రాంతాలు ఇంతకు రెండు, మూడు రెట్లు ఉన్నాయి. ఇప్పటికే ఏజెన్సీ గిరిజన ప్రజలు దుర్భర జీవితం గడుపుతున్నారు. వరదల్లో మునిగినా నష్ట పరిహారం చెల్లించలేదు. అభివృద్ధి కార్యక్రమాలు లేవు. మునిగిన ఇళ్ళకు, రోడ్లకు రిపేర్లు లేవు. ఈ స్థితిలో ముఖ్యమంత్రి ఎన్నికల వాగ్దానం ప్రకారం ఎకరాకు 10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని తిరిగి సర్వే చేసి కాంటూరు హద్దుల్ని నిర్ణయించి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాము. పోలవరం డ్యాం నిర్మాణం అది త్వరితగతిన పూర్తికావాలన్నా పునరావాసమే ప్రధానమైంది. కేంద్రప్రభుత్వం దానిపై బాధ్యతారాహిత్యంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. కేంద్రంతో పోరాడి నిర్వాసితులకు పునరావాసంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నది.

దీనిపై బిజెపి రెండు నాల్కల ధోరణిని ఖండిస్తున్నది. ఏజెన్సీ మునక ప్రాంత ప్రజల ఆందోళనకు సిపిఐ(యం) సంఘీభావం ప్రకటిస్తున్నది.

## బోయ, వాల్మీకి సమస్యపై గిరిజన సంఘాల, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోవాలి.

బోయ, వాల్మీకి సమస్యపై నియమించిన కమిటీ నివేదిక వెల్లడించకముందే శాసనసభ తీర్మానం చేసి కేంద్రానికి పంపడం వంచన తప్ప మరొకటి కాదు. ఏజెన్సీ ప్రాంత గిరిజనుల్లో దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. జి.వో. నెంబర్ 3 ప్రకారం గిరిజన ప్రాంతాల్లో 100% ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలని ఉన్నది. దానిని సుప్రీం కోర్టు రద్దు చేస్తే ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా ఎందుకు నిర్లక్ష్యం చేసి గిరిజనులకు అన్యాయం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన సంకుచిత రాజకీయ ప్రయోజనాల నిమిత్తం వివిధ తెగల, ప్రాంతాల మధ్య చిచ్చు రాజేయడం సరైంది కాదు. రాజ్యాంగంలోని 5వ షెడ్యూలు స్పూర్తికి ఇది విరుద్ధం. కాబట్టి తక్షణం ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన సంఘాలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల అభిప్రాయం తీసుకొని ఈ సమస్యపై ఏకాభిప్రాయం సాధించాలని కోరుతున్నాము.

## దళిత క్రిష్టియన్‌లను ఎస్సీలుగా గుర్తించాలి

దళిత క్రిష్టియన్‌లను ఎస్సీలుగా గుర్తించాలని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడం పట్ల సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేస్తున్నది. మతంతో నిమిత్తం లేకుండా దళితులందరినీ ఎస్సీల్లో చేర్చాలి. అందుకనుగుణంగా రాజ్యాంగ సవరణ చేయాలి. బిజెపి ఈ డిమాండ్‌ను వ్యతిరేకించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. మత ప్రాతిపదికపై దేశాన్ని చీల్చే ఏ చర్య అయినా దేశాన్ని బలహీనపరుస్తుంది. అన్ని మతాల్లోనూ కులవివక్షత, అంటరానితనం కొనసాగుతున్నది. సహేతుకమైన ఈ డిమాండ్‌ను సాధించడానికి ఢిల్లీకి అఖిలపక్ష ప్రతినిధివర్గాన్ని తీసుకుపోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ(యం) కోరుతున్నది.

(వి. శ్రీనివాసరావు)
రాష్ట్ర కార్యదర్శి